

ఓటు వినియోగిద్దాం ఇలా..

భారత ఎన్నికల సంఘం ఓటు హక్కు రక్షణకు పలు చర్యలు చేపట్టింది. ఒకరికి బదులు వేరే వ్యక్తి ఓటేయకుండా కట్టడి చేసింది. 8లో ▸



15 నుంచి మహాయాగం

భీమవరం డీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఈనెల 15 నుంచి 25 వరకు అతిరాత్ర మహాయాగం నిర్వహించనున్నారు. 8లో ▸



బాలిక దుర్మరణం

కరాటే నేర్చుకోడానికి సైకిల్‌పై వెళుతున్న ఓ బాలికను ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. 8లో ▸

పశ్చిమలో తుఫ్యానే

జగన్ కోసం జనం సిద్ధం

- ఐదేళ్లలో కనీవినీ ఎరుగని సంక్షేమం, అభివృద్ధి
- ప్రజల చెంతకు పాలన
- పారదర్శకంగా పథకాల అమలు
- సీఎం జగన్ పర్యటనలతో కేడర్‌లో ఫుల్‌జోష్
- చంద్రబాబు, పవన్ సభలకు స్పందన కరువు
- కూటమిలో అంతర్గత కుమ్ములాటలు
- జిల్లాలోని అన్ని స్థానాల్లో విజయంపై వైఎస్సార్‌సీపీ ధీమా

సంక్షేమ పథకాల లబ్ధి	11,364.57 రూ. కోట్లు	అభివృద్ధి పనులు	6,988.37 రూ. కోట్లు





తాడేపల్లిగూడెంలో డిజిటల్ తరగతులు

మనబడి నాడు–నేడులో అభివృద్ధి చేసిన మొగల్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో వైఎస్సార్ సీపీ క్లీన్‌స్వీప్ చేయనుంది. ఎంపీ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులే విజయం సాధించనున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ఈ ఐదేళ్లలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు జిల్లా ప్రజలు బ్రహ్మరథం పడుతున్న తీరు, మరోపక్క కూటమిలోని వర్గ విభేదాలు, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల పర్యటనలకు స్పందన కరువవ్వడం, కూటమి మేనిఫెస్టో ఆచరణ సాధ్యం కాదంటున్న జనమే ఇందుకు నిదర్శనం.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా..

సీఎం జగన్ పాలనలో జిల్లాలో ప్రగతి పరవళ్లు తొక్కింది. డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో సంక్షేమ పథకాల ద్వారా పేదలకు రూ.11,364.57 కోట్లు అందించారు. రూ.6,988.37 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. నరసాపురంలో ఆక్వావర్సిటీ, ఫిషింగ్ హార్బర్, పాలకొల్లులో వైద్య కళాశాల తదితర అభివృద్ధి కార్యక్రమాలు జిల్లాకు తలమానికమయ్యాయి. నాడు–నేడు పథకంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు, ఆస్పత్రుల రూపురేఖలు మారాయి. సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా పాలనను ప్రజల చెంతకు చేర్చారు. జగనన్న సురక్ష శిబిరాల ద్వారా జిల్లాలోని 6,05,780 మంది లబ్ధిదారులకు ఉచితంగా 6,48,607 సర్టిఫికెట్లు జారీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్షలో 447 వైద్యశిబిరాలు ద్వారా ప్రజల చెంతకే వెళ్లి 4.10 లక్షల మందికి వైద్యసేవలు అందించారు. నవరత్న పథకాల్లో భాగంగా 77 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి సొంతింటి కలను సాకారం చేశారు.

జనసేన కేడర్‌లో నిస్సత్తువ

పొత్తులతో సీట్ల ప్రకటన తర్వాత జనసేన శ్రేణుల్లో నిస్సత్తువ అలముకుంది. పవన్ కల్యాణ్ వైఖరిని నిరసిస్తూ ఆచంటలో ఆ పార్టీ ఇన్‌చార్జి చేగొండి సూర్యప్రకాష్ ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ అధ్యక్షుడే రెండోసారి భీమవరం నుంచి పోటీకి వెనుకడుగేయడం, భీమవరంలో సొంత నేతలకు సత్తాలేదని టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులను దిగుమతి చేసుకుని సీటు ఇవ్వడం జిల్లాలో ఆ పార్టీకి ఎంత పట్టుందో తేటతెల్లం చేసింది. టీడీపీ పోటీ ఉన్నచోట తమకు సరైన ప్రాధాన్యత ఉండటం లేదని జనసేన నేతలు మదనపడుతున్నారు. భీమవరం, తణుకు, నరసాపురం తదితర నియోజకవర్గాల్లో రెండు పార్టీల మధ్య కేడర్ మధ్య అంతర్గత విభేదాలు బయటపడ్డాయి.

వైఎస్సార్‌సీపీ ప్రచార జోరు

కూటమితో పోలిస్తే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోయారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతిఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమై వారి సమస్యలు పరిష్కరించడం, జగనన్న సురక్ష, వివిధ సంక్షేమ పథకాల సంబంధించిన కార్యక్రమాలతో ఐదేళ్లుగా జనం మధ్యనే ఉండటం ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ప్రజలకు మరింత చేరువచేసింది. ఆయా గ్రామాలు, వార్డులకు వెళ్లినప్పుడు స్థానికులను పేర్లు పెట్టి పిలుస్తూ, మీ సమస్యలు పరిష్కరించామని చెబుతూ, ఐదేళ్ల ప్రగతిని వివరిస్తూ, చేపట్టబోయే పనులను తెలుపుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అపూర్వ స్పందన లభించింది.

మళ్లీ బూటకపు హామీలు

వాస్తవ పరిస్థితులకు తగ్గట్టుగా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో ఉంటే టీడీపీ మేనిఫెస్టో వాస్తవ విరుద్ధంగా ఉందని ప్రజలు పెదవి విరుస్తున్నారు. గత అనుభవాల నేపథ్యంలో చంద్రబాబు హామీలను వారు విశ్వసించడం లేదు. కరోనా మహమ్మారి విలయ తాండవం చేసిన రోజుల్లో జగన్ సర్కారు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అండగా నిలిచిన తీరును గుర్తు చేసుకుంటున్నారు. కూటమి అభ్యర్థులు, ఆయా పార్టీల అధినేతలు అప్పుడేమయ్యారని ప్రశ్నిస్తున్నారు. గత ఎన్నికల్లో జిల్లాలో ఎంపీ స్థానంతో పాటు ఏడింటి ఐదు అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్న వైఎస్సార్‌సీపీ తాజా పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని అన్ని స్థానాల్లో విజయంతో క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎంపీగా ఉమాబాలకే అవకాశాలెక్కువ..

70 ఏళ్ల నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ చరిత్రలో తొలి బీసీ మహిళగా పోటీలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల ప్రచారంలో తనదైన శైలిలో దూసుకుపోయారు. బీజేపీ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మకు సీటు ఇవ్వడాన్ని జిల్లాకు చెందిన కూటమి అసెంబ్లీ అభ్యర్థులు వ్యతిరేకించారు. బీసీ మహిళకు సీటు ఇవ్వడం వైఎస్సార్‌సీపీకి బాగా కలిసొచ్చే అంశమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ఉమాబాల విజయానికి బాటలు వేస్తుందని అంటున్నారు.

జగన్ పర్యటనలతో ప్రభంజనం

జిల్లాలో సీఎం జగన్ ఎన్నికల ప్రచారానికి జనం ప్రభంజనంలా తరలిరావడం వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఫుల్‌జోష్ నింపింది. ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల మీదుగా సాగిన బస్సుయాత్రకు దారి పొడవునా బారులు తీరి జననేతకు బ్రహ్మరథం పట్టారు. భీమవరం, నరసాపురంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలకు మండుటెండను లెక్కచేయకుండా వేలాదిగా తరలివచ్చి జై జగన్ నినాదాలతో హోరెత్తించారు.

అభ్యర్థుల్లో ధీమా

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు తాడేపల్లిగూడెంలో కొట్టు సత్యనారాయణ, తణుకులో కారుమూరి వెంకట నాగేశ్వరరావు, నరసాపురంలో ముదునూరి ప్రసాదరాజు, భీమవరంలో గ్రంధి శ్రీనివాస్, ఆచంటలో చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఉండిలో పీవీఎల్ నర్సింహరాజు, పాలకొల్లులో గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) విజయంపై పూర్తి ధీమాతో ఉన్నారు.

కూటమి సభలకు స్పందన నిల్

టీడీపీ, జనసేన తొలిసారిగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభ తుస్సుమనిపించింది. సభా ప్రాంగణంలో సగానికి పైగా గ్యాలరీలు ఖాళీగానే ఉండిపోయాయి. తర్వాత నరసాపురం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, ఉండిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు నిర్వహించిన ప్రచార సభలకు జనం రాక వెలవెలబోయాయి. వారు ప్రసంగిస్తున్న సమయంలోనే జనం వెనుదిరిగి వెళ్లిపోవడం కనిపించింది.

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి శేషసాయికి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ఆదివారం సందర్శించారు. కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామి వారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

ప్రశాంతంగా పోలింగ్ జరగాలి



పెదవేగిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి

పెదవేగి: పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి గొడవలు జరగకుండా సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి పెదవేగి హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతితో కలిసి ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, భారీ బందోబస్తు, ప్రత్యేక బలగాలను ఏర్పాటుచేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


శ్రీవారి సేవలో..



గజలక్ష్మి నుంచి ఆశీర్వచనం పొందుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ ఆదివారం సందర్శించారు. సోమవారం ఎన్నికల పోలింగ్ కావడంతో ఆయన సెంటిమెంట్‌గా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. గో, గజ శాలలకు వెళ్లి అక్కడ గోవులకు దాణాను అందించారు, గజలక్ష్మి నుంచి ఆశీర్వచనాన్ని పొందారు.

ఓటర్ స్లిప్పులపై టీడీపీ ప్రచారం



టీడీపీ పంపిణీ చేసిన ఓటర్ స్లిప్పులు

పాలకొల్లు సెంట్రల్: తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఇటీవల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరిగిన సమయంలో పాలకొల్లు ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి నిమ్మల రామానాయుడు పసుపు రంగు చొక్కా వేసుకుని బూత్‌ల వద్దకు వచ్చి ఉద్యోగులతో మాట్లాడటంపై వైఎస్సార్‌సీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నారు. ఈ స్లిప్పుల్లో ఓ వైపు ఓటరు వివరాలతో పాటు మరోవైపు నిమ్మల ఫొటో వేసుకుని ప్రచారం చేస్తున్నారు. వీటిని పోలింగ్ కేంద్రాల్లోకి ఎలా అనుమతిస్తారంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రశ్నిస్తున్నారు. సోమవారం పోలింగ్ కేంద్రాల వద్దకు ఎమ్మెల్యే పసుపు రంగు చొక్కాతో వచ్చినా, ఓటర్లు పసుపు రంగు స్లిప్పులతో వచ్చినా అధికారులు అడ్డుకోకపోతే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అంటున్నారు.

ఓటుకు వేళాయె

నేడే ఎన్నికల పోలింగ్

- జిల్లాలో 14.72 లక్షల మంది ఓటర్లు
- 1,463 పోలింగ్ కేంద్రాలు
- పార్లమెంట్ స్థానం బరిలో 27 మంది..
- అసెంబ్లీ స్థానాల బరిలో 99 మంది అభ్యర్థులు
- పోలింగ్ స్టేషన్లకు చేరిన సిబ్బంది

సార్వత్రిక ఎన్నికల సమరం తుది దశకు చేరింది. జిల్లాల పునర్విభజన అనంతరం నూతనంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లాలో తొలిసారిగా ఎన్నికలు జరుగుతున్నాయి. జిల్లాలో ఒక పార్లమెంట్ స్థానానికి 27 మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 99 మంది బరిలో నిలిచారు. జిల్లాలో 14,72,923 మంది ఓటర్లు ఉండగా 1,463 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పురుషులు 7,21,532 మంది, మహిళలు 7,51,313 మంది, థర్డ్ జెండర్లు 78 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



బ్యాలెట్ యూనిట్‌తో వెళుతున్న ఉద్యోగిని



భీమవరంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది కోలాహలం

సాక్షి, భీమవరం: జిల్లాలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఈ మేరకు సర్వం సిద్ధమైంది. ఆచంటలో 19 సెక్టార్లు, పాలకొల్లులో 21 సెక్టార్లు, నరసాపురంలో 16 సెక్టార్లు, భీమవరంలో 21 సెక్టార్లు, ఉండిలో 22 సెక్టార్లు, తణుకులో 23 సెక్టార్లు, తాడేపల్లిగూడెంలో 18 సెక్టార్లు ఏర్పాటుచేశారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి సెక్టార్ల వారీగా ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని తీసుకుని ఆదివారం తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక బస్సుల్లో పోలీస్ బందోబస్తుతో ఎన్నికల అధికారులు, సిబ్బంది చేరుకున్నారు. సోమవారం ఉదయం ఏజెంట్ల సమక్షంలో నమూనా ఓటింగ్ నిర్వహించిన అనంతరం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 6 గంటలు దాటినా క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించనున్నారు. భీమవరం, ఉండి నియోజకవర్గాలకు సంబంధించి లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్యలు దగ్గరుండి పర్యవేక్షించారు.



భీమవరంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ ప్రవీణ్‌ఆదిత్య

పటిష్ట బందోబస్తు : జిల్లాలో 10,233 మంది ఎన్నికల సిబ్బంది, 1,700 మంది పోలీసులు, 10 కంపెనీల కేంద్ర పోలీసు బలగాలు, రాష్ట్ర బలగాలు రెండు ప్లాటూన్లు, 1,200 మంది ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఎక్స్‌సర్వీస్ మెన్, రిటైర్డ్ ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు.

హోమ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ : జిల్లాలో హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించారు. హోమ్ ఓటింగ్‌లో 1,088 మంది వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌కు 13,854 మంది దరఖాస్తు చేసుకోగా 12,773 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రశాంత వాతావరణంలో జరిగేలా.. జిల్లాలో హింసకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు పూర్తి ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఎన్నికల విజయవంతానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు.

పక్కాగా ఎన్నికల సామగ్రి పంపిణీ

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భీమవరం, ఉండి నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రి పంపిణీని చేశారు బూత్ వారీగా మూడు బ్యాలెట్ యూనిట్లు, ఓటర్ మార్క్‌డ్ కాపీ, ట్యాగ్‌లు, రెండు వీవీ ప్యాడ్స్, కంట్రోల్ యూనిట్స్, ఇంకు బాటిల్, రెండు అట్టలు అందజేశారు. 2,850 మంది సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందజేసి ప్రత్యేక వాహనాల్లో ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

వర్షంతో ఇబ్బంది : ఎన్నికల సిబ్బంది భోజనాల అనంతరం పోలింగ్ కేంద్రాలకు బయలుదేరుతున్న సమయంలో ఒక్కసారిగా వర్షం పడింది. దీంతో ఎన్నికల సామగ్రి తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పర్యవేక్షణ లోపం కారణంగా భోజనాలు, అల్పాహారం పూర్తిస్థాయిలో అందలేదని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు.

కలెక్టర్, జేసీ పర్యవేక్షణ

భీమవరం, ఉండి నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నిక సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్‌ఆదిత్య, భీమవరం ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు పర్యవేక్షించారు. కొత్తగా వచ్చిన ట్రైనీ ఎస్పీలకు ఎన్నికల తీరుతెన్నులను ఆర్డీఓ శ్రీనివాసులురాజు వివరించారు.



బ్యాలెట్ సామగ్రిని సర్దుకుంటున్న దృశ్యం



ఎన్నికల విధులకు మేము సైతం అంటున్న మహిళా సిబ్బంది



బస్సు ఎక్కుతున్న దృశ్యం



భీమవరంలో ట్రైనీ ఎస్పీలకు వివరాలను వెల్లడిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులురాజు

క్లుప్తంగా

108 వాహనంలో ప్రసవం



కొడమంచిలిలో శిశువుతో 108 సిబ్బంది

పెనుగొండ: ఆచంట మండలం కొడమంచిలికి చెందిన గర్భిణి 108 వాహనంలో ప్రసవించింది. కొడమంచిలికి చెందిన లక్ష్మీ పూజితకు పురిటి నొప్పులు వస్తుండడంతో స్థానిక వైద్యులు కాకినాడ జీజీహెచ్‌కు పంపాలని సూచించడంతో 108కి సమాచారం అందించారు. 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలిస్తుండగానే మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ టెక్నిషియన్ జి.సురేష్, పైలెట్ నాగేశ్వరరావు డెలివరీ చేయించడంతో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉండడంతో వీరిని మార్గమధ్యలో తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం ఆలమూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

ఎన్నికల విధుల్లో ఉద్యోగిని తలకు గాయం



గాయపడ్డ ఉద్యోగినిని వైద్యానికి తరలిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ గ్రౌండ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఈవీఎంల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మహిళా ఉద్యోగినికి ప్రమాదవశాత్తూ తలకు గాయమైంది. పోలింగ్ విధులకు హాజరైన సిబ్బంది కోసం భారీగా టెంట్‌లను ఏర్పాటు చేశారు. సుమారు 2000 మందికి పైగా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఈవీఎంలు తీసుకుని టెంట్‌లో కుర్చుని ఉన్న సమయంలో టెంట్‌కు వేసిన ఒక కర్ర మహిళా ఉద్యోగిని తలపై పడడంతో తీవ్ర గాయమైంది. దీంతో అక్కడి సిబ్బంది ఆమెను వైద్యం కోసం తరలించారు.

తెలంగాణ మద్యం పట్టివేత



నిందితుడు, పట్టుబడిన మద్యంతో పోలీసులు

కై కలూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీల్లో 130 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ సుధ చెప్పారు. కలిదిండి మండలం పడమటి పాలెంలో ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.22,100 విలువైన మద్యం సీసాలను తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారమన్నారు. ఎస్ఈబీ ఎస్సై రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు.. వినియోగిద్దాం ఇలా..



- ఓటు హక్కు రక్షణకు ఎన్నికల సంఘం చర్యలు
- ఒకరి ఓటు వేరొకరు వేయకుండా కట్టడి
- స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించేలా ప్రత్యేక దృష్టి

ఏలూరు టౌన్ : భారత ఎన్నికల సంఘం ఓటు హక్కు రక్షణకు అనేక చర్యలు చేపట్టింది. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడంతో పాటు, తన ఓటును వేరేవారు వేయడాన్ని కట్టడి చేసేందుకు టెండర్ ఓటు, చాలెంజ్ ఓటు నమోదు చేసే అవకాశాన్ని కల్పించారు. ఓటర్లు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా ఎటువంటి ఇబ్బంది లేకుండా వేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. ఓటు హక్కు రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎన్నికల సంఘం ఆదేశాలు ఇలా ఉన్నాయి.

టెస్ట్ ఓటు

ఓటరు తన ఓటు వేశాక వీవీ ప్యాట్‌లోని స్లిప్‌లో తాను కోరుకున్న అభ్యర్థికి ఓటు పడలేదని గుర్తిస్తే వెంటనే ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయాలి. తప్పుడు అభియోగమైతే జరిగే పరిణామాలను ప్రిసైడింగ్ అధికారి ఓటరుకు హెచ్చరిస్తారు. ఓటరు నుంచి రాతపూర్వకంగా అమోదం తీసుకుంటారు. పోలింగ్ ఏజెంట్ల ముందు ఓటింగ్ మిషన్‌లో టెస్ట్ ఓటు వేసేందుకు అనుమతిస్తారు. టెస్ట్ ఓటు వేసే సమయంలో ఓటరు కోరుకున్న అభ్యర్థి పేరు, చిరునామా ఫారం-14లో నమోదు చేస్తారు. ఓటరు ఆరోపణ తప్పుగా తేలితే రెండో ఎంట్రీకి ఎదురుగా ఓటరు ఏ అభ్యర్థికి ఓటు వేసిందీ రాసి, అతని సంతకం తీసుకుని పోలీసులకు అప్పగిస్తారు.

నమూనా ఓటు

పోలింగ్ బూత్‌లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి గంట ముందు ఈవీఎం చెక్ చేసేందుకు వివిధ రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లతో 50 ఓట్లు వేస్తారు. ఆ ఓట్ల లెక్కింపు వెంటనే పూర్తి చేసి ఈవీఎంల నుంచి తొలగిస్తారు. అనంతరం పోలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. ఈవీఎంలను పరిశీలించేందుకు వేసే ఓట్లను నమూనా ఓట్లు అంటారు.

టెండర్ ఓటు

ఓటరు తమ ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌కు వెళ్లినప్పుడు అంతకుముందే ఎవరైనా ఓటు వేసి ఉంటే టెండర్ ఓటు వేయవచ్చు. ఆరోపణ చేసిన ఓటరు వాస్తవ ఓటరుగా నిర్ధారించుకున్నాక పోలింగ్ అధికారి అతడికి బ్యాలెట్ ఓటు వేసే అవకాశం ఇస్తారు. వారికి ఈవీఎంలో బటన్ నొక్కే అవకాశం ఉండదు. బ్యాలెట్ సీల్డ్ కవర్‌లో భద్రపరుస్తారు. అభ్యర్థుల ఓట్ల లెక్కింపు అనంతరం సమానంగా ఓట్లు వస్తే టెండరు ఓటును పరిగణనలోకి తీసుకుంటారు.

చాలెంజ్ ఓటు

ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన ఓటరుపై పోలింగ్ ఏజెంట్ల నుంచి ఓటరు కాదని అభ్యంతరం చెబితే చాలెంజ్ ఓటు వేయవచ్చు. అభ్యంతరం చెప్పిన ఏజెంట్ నుంచి పోలింగ్ అధికారి రూ.2లు తీసుకుని రశీదు ఇస్తారు. ఓటరు, ఏజెంట్లు అక్కడ ఉన్న ఇతర ఓటర్ల నుంచి పోలింగ్ అధికారి వివరాలు తీసుకుంటారు. ఓటరుగా నిర్ధారణ చేశాక ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. ఒకవేళ నిర్ధారణ కాకుంటే చాలెంజ్ ఓటు వేసిన వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తారు.

ఓటర్లూ.. ఈ నిబంధనలు పాటించండి

డీ. మేరి ప్రశాంతి జిల్లా ఎస్పీ



ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డీ మేరిప్రశాంతి చెప్పారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వినియోగించుకునేందుకు గట్టి భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు భయాందోళలనకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఇక ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లు, రాజకీయపార్టీలు, అధికారులు ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

- జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంది. 144 సీఆర్‌పీసీ సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురికి మించి ఒకచోట గుమిగూడి ఉండకూడదు.
- పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లు సెల్‌ఫోన్లు తీసుకురాకూడదు
- మహిళలు, పురుషులు వేర్వేరుగా క్యూలైన్ పాటించి పోలీసు శాఖతో సహకరించాలి
- మద్యం తాగి ఓటు వేయటానికి రాకూడదు
- పోలింగ్ కేంద్రానికి ఎలాంటి మారణాయుధాలు తీసుకురాకూడదు. వాటర్ బాటిల్స్, ఇంకు బాటిల్స్ కేంద్రలోకి నిషిద్ధం
- రాజకీయ పార్టీలకు చెందిన స్టిక్కర్లు, టోపీలు, కండువాలు, జెండాలతో పోలింగ్ కేంద్రానికి రాకూడదు
- ఓటరు స్లిప్‌తో ఓటు వేసేందుకు వెళితే ఓటరు ఏదైనా ఒక గుర్తింపు కార్డును విధిగా తీసుకు వెళ్లాలి
- పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, సర్వీస్ గుర్తింపు కార్డు, ఫొటోతో కూడిన బ్యాంకు, పోస్ట్ ఆఫీస్ పాస్‌బుక్, పాన్ కార్డు, ఆధార్‌కార్డు, హెల్త్‌కార్డు, పెన్షన్ డాక్యుమెంట్ ఇలా ఏదోక గుర్తింపు తీసుకెళ్లాలి
- పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లైన్ లోపల మాత్రమే ఓటర్లకు ప్రవేశం ఉంటుంది
- ఓటు వేసిన వెంటనే పోలింగ్ కేంద్రాన్ని విడిచి వెళ్లాలి. పోలింగ్ కేంద్రంలో ఉండేందుకు అనుమతి లేదు.
- పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల అవతల మాత్రమే ఓటు వేసేందుకు వచ్చేవారి వాహనాలను పార్కింగ్ చేయాలి
- పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో రాజకీయ పార్టీలకు చెందిన వారు టెంట్లు వంటివి ఏర్పాటు చేసుకోవచ్చు. చిన్న టేబుల్, రెండు కుర్చీలు ఏర్పాటు చేసుకుని, ఇద్దరు వ్యక్తులు మాత్రమే అక్కడ ఉండాలి. పార్టీలకు చెందిన జెండాలు, బ్యానర్లు ప్రదర్శించకూడదు
- రాజకీయ పార్టీలకు చెందిన వారు పోలింగ్ కేంద్రాల సమీపంలో టెంట్లు ఏర్పాటు చేసి టిఫిన్లు, భోజనాలు వంటివి ఏర్పాటు చేయకూడదు
- పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌క్యాస్టింగ్ ఉన్నందున ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా నేరంగా పరిగణిస్తారు
- ఓటర్లు ఓటు వేసే సమయంలో ఫొటోలు తీయటం, సోషల్ మీడియాలో పోస్ట్ చేయటం చట్ట రీత్యా నేరం.

15 నుంచి భీమవరంలో అతిరాత్ర మహాయాగం

- 11 రోజులపాటు 26 మంది రుత్వికులతో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తయ్యాయంటూ యజ్ఞ పర్యవేక్షకుల వెల్లడి



అతిరాత్ర మహాయాగం కోసం ఏర్పాటు చేసిన చలువ పందిరి

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం డీఎన్ఆర్ కళాశాలలోని గన్నాబత్తుల వారి మైదానంలో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు 11 రోజులపాటు జరగనున్న అతిరాత్ర మహాయాగం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని యజ్ఞ పర్యవేక్షకులు చెరుకువాడ రంగసాయి, నడింపల్లి బంగార్రాజు, కంతేటి వెంకటరాజు ఆదివారం చెప్పారు. రాష్ట్రం, ఇతర రాష్ట్రాల నుంచి వేద పండితులు, రుత్వికులు 11 రోజులపాటు యాగ నిర్వహణలో పాల్గొంటారన్నారు. యజ్ఞ కర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్ నేతృత్వంలో డీఎన్నార్ కళాశాల యాజమాన్యం సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ప్రతి రోజూ శివ కల్యాణం, కోటి గాయత్రీ జపం, తదితర కార్యక్రమాలు జరపడానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయన్నారు. 11 రోజుల పాటు అన్నప్రసాదం, తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేస్తామని, భక్తులందరూ యజ్ఞ పూజ కార్యక్రమంలో పాల్గొని సహకారం అందించాలని కోరారు. శ్రీనివాస సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కూడా ఇటువంటి మహాయాగం జరగలేదని, 25న పుత్రకామేష్టి యాగం జరుగుతుందని, 15న ఉదయం 7.45 గంటలకు ఈ యాగం ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, విశ్వనాథ్‌రాజు, పెన్మెత్స సత్యనారాయణ రాజు, డి.అప్పలరాజు, రామ సీతా తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని బాలిక దుర్మరణం



ఘటనా స్థలంలో ప్రమాదం దృశ్యం, దుండి పుష్పప్రియ (ఫైల్)

భీమవరం: ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోడానికి సైకిల్‌పై వెళుతున్న ఓ బాలికను ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న గునుపూడి గరువుపేటకు చెందిన దుండి జయరాజు తన పిల్లలకు కరాటే నేర్పిస్తున్నాడు. ఆదివారం ఉదయం జయరాజు కుమార్తె పుష్పప్రియ (10), కుమారుడు వేర్వేరు సైకిళ్లపై ఇంటి నుంచి బయలుదేరి కరాటే స్కూల్‌కు బయలుదేరారు. పట్టణంలోని నాచువారి సెంటర్ వద్దకు వచ్చేసరికి ధాన్యం లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొనడంతో పుష్పప్రియ ఘటనా స్థలంలోనే మృతి చెందింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల వేళ.. చేపల చెరువు తవ్వకం

- ఎంఎంపురంలో టీడీపీ నేత నిర్వాకం
- అడ్డుకున్న ఆటవీ, పోలీస్, రెవెన్యూ అధికారులు
- రెండు జేసీబీల సీజ్, కౌలు రైతుపై కేసు నమోదు



భీమడోలు: ఎన్నికల వేళ టీడీపీ నేత పుప్పాల శ్రీనివాసరావు పూళ్ల పంచాయతీ శివారు ఎంఎం పురంలోని కొల్లేరు కాంటూరు పరిధిలో 30 ఎకరాల వ్యవసాయ భూమిలో చేపల చెరువును తవ్వించేందుకు ఆదివారం గుట్టుగా పనులకు ఉపక్రమించారు. సమాచారం అందుకున్న ఆటవీ, పోలీస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడి చేసి చెరువు తవ్వకం పనులను అడ్డుకుని రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. కౌలు రైతుపై కేసు నమోదు చేశారు. ఆ భూమి కాంటూరు పరిధిలో ఉన్నందున కేవలం సాగుకు మాత్రమే అనుమతి ఉంది. ఆ భూమిని కొన్నేళ్లుగా మన్యం బాబూజీ అనే కౌలు రైతు సాగు చేస్తున్నాడు. ఎన్నికల వేళ ఆ వ్యవసాయ భూమిని టీడీపీ నేత ప్రోద్బలంతో కౌలు రైతు మన్యం బాబూజీ రెండు జేసీబీలతో వ్యవసాయ భూమి చుట్టూ నిబంధనలను ఉల్లంఘిస్తూ గట్టు వేసేందుకు పనులను ప్రారంభించారు. దీంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన వచ్చిన అటవీ శాఖ ఎఫ్ఎస్‌వో ఎం.పాపారత్నం, ఏఎస్సై చలపతిరావు, రెవెన్యూ అధికారులు ఆ భూమిని పరిశీలించి గట్టు వేస్తున్న రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. 150 మీటర్లలో 8.30 ఎకరాల భూమి చుట్టూ గట్టు వేశారని అటవీ శాఖ ఎఫ్ఎస్‌వో పాపారత్నం నిర్ధారించారు. కౌలు రైతు మన్యం బాబూజీపై కేసు నమోదు చేశారు. కొల్లేరు కాంటూరు భూమిలో చేపల చెరువులు తవ్వితే వారిపై అటవీ శాఖ చట్టం మేరకు కేసులు నమోదు చేస్తామని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



నాగుల్ మృతదేహం

ఆగిరిపల్లి: మండలంలోని అమ్మవారిగూడెంతిప్పకు చెందిన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏఎస్సై తవేరియా నాయక్ తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ నాగుల్ (18) అనే యువకుడు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన నాగుల్ సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు చుట్టుపక్క ప్రాంతాల్లో వెతికిన ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం ఆగిరిపల్లి శివారు గన్నవరం రోడ్డులోని పూల్చేరు కుంటలో నాగుల్ మృతదేహాన్ని కొంతమంది యువకులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి రేహామునిస్సా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అంతర్జాతీయ చెస్ టోర్నీకి 50 మంది ఎంపిక



భీమవరంలో చెస్ టోర్నీ విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

భీమవరం: భీమవరంలో నిర్వహించిన స్టేట్ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు ఆదివారం ప్రశంసాపత్రాలు అందజేశారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన ఈ పోటీల్లో 200 మంది క్రీడాకారులు పాల్గొనగా 50 మంది విజేతలుగా నిలిచారు. వీరిలో పెద్దలు, చిన్నారులు 25 మంది ఉన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ విజేతలు జూన్ 4వ తేదీ నుంచి 6 రోజుల పాటు భీమవరంలో నిర్వహించే ఇంటర్నేషనల్ రాపిడ్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి అర్హత సాధించారన్నారు. రాపిడ్ టోర్నమెంట్‌లో విజేతలకు సుమారు రూ.5 లక్షల నగదు బహుమతులు అందిస్తామన్నారు. శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపం కార్యదర్శి మెంటే పార్థసారథి మాట్లాడుతూ చెస్ ద్వారా అపారమైన మేధాశక్తిని పెంపొందించుకోవచ్చని, తల్లిదండ్రులు చెస్ క్రీడను ప్రోత్సహించాలన్నారు. ఎస్‌బీఐ మేనేజర్ మూర్తి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ గనిరెడ్డి త్రినాథ్, ఏలూరు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి శిరిగినీడి కోటేశ్వరరావు, పెదపాటి రవిప్రసాద్, అల్లు శ్రీనివాస్, మాదాసు రవికుమార్, చెస్ చీఫ్ ఆర్బిటర్ జీవీ కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ నేతల దాడిలో వైఎస్సార్ సీపీ నేతకు గాయాలు



నుదుటిపై అయిన గాయం

ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి చేసిన దాడిలో వైఎస్సార్ సీపీ నాయకుడికి గాయాలయ్యాయి. బాధితుడి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పంగిడిగూడెం మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు లావూరి చినవెంకన్నపై అదే గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దారవత్తు నాగరాజు, ఆ పార్టీ నాయకుడు వడ్లపూడి శ్రీను, కార్యకర్తలు బోడ ప్రసాద్, లావూరి నాగరాజు, భుక్య వెంకట్రావు కక్ష పెంచుకున్నారు. రాజకీయంగా అడ్డు వస్తున్నాడన్న కారణంగా ఇప్పటికే పలుమార్లు చినవెంకన్నతో వారు గొడవలు పడ్డారు. ఇదిలా ఉంటే శనివారం రాత్రి చినవెంకన్న ఇంటి వద్దకు వెళ్లిన సదరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అతడిని బయటకు పిలిచి ఒక్కసారిగా దాడి చేశారు. రాయితో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఎన్నికల పోలింగ్ జరిగే సమయంలో అక్కడికి వస్తే చంపేస్తామని హెచ్చరించి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు తొలుత ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జరిగిన ఘటనపై బాదితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేత్రపర్వం.. చాత్మార్ ఉత్సవం



తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధులకు పయనమైన స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి చాత్మార్ ఉత్సవం ఆదివారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో నేత్రపర్వంగా జరిగింది. శ్రీమద్రామానుజుల తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అర్చకులు తొళక్క వాహనంపై ఉంచి, సుగంధ భరిత పుష్పమాలికలతో విశేషంగా అలంకరించారు. అనంతరం పూజాధికాలను జరిపి, హారతులిచ్చారు. ఆ తరువాత స్వామివారి వాహనం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి వద్ద భక్తులు శ్రీవారికి నీరాజనాలను సమర్పించారు.

ఓట్ల పండగకు సొంతూళ్లకు..

- జిల్లాకు తరలివస్తున్న ప్రవాస జిల్లా వాసులు
- హైదరాబాద్ నుంచి 42 ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
- రోజువారీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులూ 20 పైనే

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఓట్ల పండగకు ప్రజలు సొంతూళ్ల బాట పట్టారు. ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా ఇతర జిల్లాల్లో స్థిరపడినా ఓటు హక్కును ఈ జిల్లాలోనే వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. వీరి కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో స్థిరపడిన జిల్లా వాసులను జిల్లాకు తరలించడానికి ఆర్టీసీ 42 ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. వీటిలో ఇంద్ర, అమరావతి వంటి ఏసీ బస్సులతో పాటు సూపర్ డీలక్స్ బస్సులు కూడా ఉన్నాయి. జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోలకు చెందిన బస్సులు గత శుక్రవారం రాత్రి నుంచి హైదరాబాద్ నుంచి జిల్లాకు ప్రజలను తరలించే పనిలో పడ్డాయి. 42 ప్రత్యేక బస్సులే కాకుండా హైదరాబాద్ నుంచి ప్రతి రోజూ జిల్లాకు వచ్చే సుమారు 20 బస్సులు కూడా ప్రజలను తీసుకువస్తున్నాయి. కాగా ఓటు వేయడానికి వస్తున్న ప్రవాస పశ్చిమ వాసులకు రానుపోను చార్జీలకయ్యే మొత్తాన్ని ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులే ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఒక సామాజికవర్గానికి చెందిన నాయకులు హైదరాబాద్ నుంచి ఓటర్లను తరలించడానికి సుమారు 20 ప్రైవేట్ ఏసీ బస్సులను ఏర్పాటు చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది.

కొత్త యువ ఓటర్లు 42,196

కాగా జిల్లాలో 18 - 19 సంవత్సరాలు నిండి కొత్తగా ఓటు హక్కు పొందిన యువ ఓటర్లు 42,196 మంది ఉన్నారు. వీరిలో 22,661 మంది యువకులు ఉండగా, 19,535 మంది యువతులు ఉన్నారు. వీరిలో ఉంగుటూరు నియోజకవర్గంలో 3195 మంది యువకులు, 2,828 మంది యువతులు, దెందులూరు నియోజకవర్గంలో 3,266 మంది యువకులు, 2,887 మంది యువతులు, ఏలూరు నియోజకవర్గంలో 3,026 మంది యువకులు, 2,655 మంది యువతులు ఉన్నారు. అలాగే పోలవరం నియోజకవర్గంలో 3,350 మంది యువకులు, 2,926 మంది యువతులు, చింతలపూడి నియోజకవర్గంలో 3,708 మంది యువకులు, 3,089 మంది యువతులు, నూజివీడు నియోజకవర్గంలో 3298 మంది యువకులు, 2,713 మంది యువతులు, కైకలూరు నియోజకర్గంలో 2818 మంది యువకులు, 2,437 మంది యువతులు ఉన్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కలిపి 20 నుంచి 29 సంవత్సరాల వయసు ఉన్న ఓటర్లు 2,89,116 మంది ఉన్నారు. వీరిలో 1,47,987 మంది యువకులు, 1,41,091 మంది యువతులు ఉన్నారు. వీరిలో కూడా తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే వారు 20 శాతం మంది ఉంటారని అంచనా. మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే జిల్లాలో 100 నుంచి 109 సంవత్సరాల మధ్య వయసు కలిగిన సూపర్ సీనియర్ ఓటర్లు 21 మంది ఉండగా, 90 నుంచి 99 సంవత్సరాల మధ్య వయస్కులు 1,276 మంది ఓటర్లు ఉన్నారు.

క్లుప్తంగా

ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పూజలు



స్ఫటికలింగాన్ని విశేష పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): శంకర జయంతి సందర్భంగా స్థానిక శంకరమఠం దేవస్థానంలో ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి, సర్వ మంగళమ్మ అమ్మవారికి, స్పటిక లింగానికి ఆదివారం విశేష అర్చనలు జరిగాయి. వేదపండితులచే అరుణపారాయణం, అమ్మవారికి విశేష కుంకుమార్చనలు చేశారు. స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు గరికపాటి బాపయ్య శర్మ, మహతి, పండు, కౌశిక్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి



నర్సస్ డే సందర్భంగా పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నర్సుల సేవలు వెలకట్టలేనివని పలువురు వక్తలు తెలిపారు. ఇంటర్నేషనల్ నర్సస్ డే, సిస్టర్ ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని స్థానిక జ్యోతి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినీలు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. నర్సెస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పండ్లు, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ కీర్తి, హెడ్ సిస్టర్స్ పరంజ్యోతి, వెంకటలక్ష్మి, ప్రియాంక, బి.తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం



మదర్స్‌డే సందర్భంగా పలువురిని సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలో శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమం వద్ద ఆరా ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మదర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. మాతృమూర్తులకు పాద పూజ చేశారు. ఈ కార్యక్రమంలో యోగా కోచ్ కరిబండి రామకృష్ణ, లక్ష్మి సరస్వతి, సుభద్ర గుప్తా, అంబిక, అమల, సుజాత, రేణుక, దేవి పాల్గొన్నారు.

నేడే ఎన్నికల పోలింగ్

- 233 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు
- తణుకు బరిలో 13 మంది అభ్యర్థులు

తణుకు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాలతో పాటు తణుకు పట్టణంలోని మొత్తం 233 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ పర్యవేక్షణలో పోలింగ్ జరగనుంది. ఈ మేరకు ఆదివారం తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ద్వారా ఎన్నికల సామాగ్రిని సిబ్బందికి అందజేశారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల సౌకర్యం కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు కల్పించారు. ఎన్నికల నిర్వహణతోపాటు ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేలా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీవీ రమణ తెలిపారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 7వ తేదీ వరకు ఈశిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతి రోజు శాఖా గ్రంథాలయానికి పంపాలని, ఉపాధ్యాయులు తమ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. ఈ శిబిరంలో రిసోర్స్‌పర్సన్స్ గరికిపాటి బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామి, కంబాల వెంకట సత్యప్రకాష్, చంద్రశేఖర్, కర్రి రామచంద్రరావు, డి.కుసుమకుమారి, ఎస్.సత్యం, వి.రామచంద్రరావు, డి.కుసుమ కుమారి, ఎస్.సత్యం, వి.రామాంజనేయులు ఏవీ లక్ష్మణరావులచే శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు కథలు చెప్పడం, వినడం, పుస్తక పఠం, ఆటలు, ఇంగ్లీషు గ్రామర్, చిత్రలేఖనం, సైన్స్, తెలుగు తదితర పాఠ్యాంశాలు చెప్పడం జరుగుతాయన్నారు. ప్రతి విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాడేపల్లిగూడెంలో జగన్ వైపే జనం

- సంక్షేమం, అభివృద్ధికి రూ. 3,000 కోట్లు..
- 59 నెలల సంక్షేమ పాలనపట్ల హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం..



గూడెం పట్టణం



వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: ప్రజాసేవ చేసే అవకాశం రావడం ఒక అదృష్టం. సేవలు చేసిన వారు, ప్రజలకు అండగా ఉన్న వారు , సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిన వారు. ఆయా ప్రాంత రూపురేఖలను మార్చిన వారు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారు. సార్వత్రిక ఎన్నికల్లో గూడెం నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది. గూడెంలో ఉన్న మహామహులంతా కొట్టుతో జతకట్టడంతో ఇక్కడ ఫ్యాన్ గాలి బలంగా వీస్తోంది. దీంతో ప్రత్యర్థి కూటమి గింగిరాలు తిరుగుతుంది. నియోజకవర్గంలో ఎప్పటినుంచో ఉన్న హేమాహేమీలంతా వైఎస్సార్‌సీపీలో చేరడంతో కూటమి అభ్యర్థికి గుండెల్లో దడ పట్టుకుంది. దీంతో తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా, దేవదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కొట్టు సత్యనారాయణ తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన మరోసారి పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగారు.ఈ వరుసలో కీర్తి గడించిన వారు డిప్యూటీసీఎం, దేవదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ అగ్రభాగాన నిలుస్తారు. 30 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోడానికి ప్రయత్నాలు చేయడంతో గూడెంలో జై కొట్టు అంటున్నారు.

తొలిసారి ఇచ్చిన అవకాశంతో..

1994లో రాజకీయ అరంగేట్రం చేసిన కొట్టు సత్యనారాయణ 2004 నుంచి 2009 వరకు ఎమ్మెల్యేగా ఉన్నారు. తిరిగి 2019 నుంచి ప్రస్తుతం ఎమ్మెల్యేగా, డిప్యూటీసీఎం, దేవదాయశాఖామంత్రిగా ఉన్నారు. ప్రజాశీర్వాదంతో పాలనలో తన మార్కును వేశారు. తొలిసారి 700 కోట్ల అభివృద్ధి రాజన్న పాలన, కొట్టు నాయకత్వంలో 2004 నుంచి 2009 వరకు సుమారు నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి రూ. 700కోట్ల రూపాయల అభివృద్ధి జరిగింది. కొట్టు హయాంలో అభివృద్ధి చేసినా వైనాన్ని సైతం ప్రజానీకం హర్షిస్తున్నారు. దేశంలో రెండవది, దక్షిణ భారతదేశంలో మొదటిది ఉద్యానవిశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఏయు క్యాంపస్ ఏర్పాటు, వెటర్నరీ పాలిటెక్నిక్ ఏర్పాటు, ఎర్రకాల్వపై వరదల నివారణకు రామరాజు గట్టు, బాపన్నకోడు చెక్ డ్యామ్‌ల పునర్నిర్మాణ పనులు, ఎర్రకాల్వపై మాధవరం, వీరంపాలెం, అప్పారావుపేట వద్ద వంతెనల నిర్మాణం, రాజీవ్ గృహకల్ప కింద 280 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం, ఇందిరమ్మ అర్బన్ ఇళ్ల కింద 480 ఇళ్ల నిర్మాణం, పల్లెల్లో ఇందిరమ్మ ఇళ్లు , పట్టణంలో రెండో ఫ్లైవోవర్ వంతెన నిర్మాణం, రహదారులు అంతర్గత రోడ్ల నిర్మాణం, పట్టణంలో భూగర్భ డ్రైయినేజీ నిర్మాణాలతో సుమారు 700 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశారు. రెండోసారి 2019లో ప్రజలు దీవించిన తర్వాత సుమారు 3,000 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేశారు. చిలకంపాడు నుంచి ఉద్యానవర్సిటీ వరకు నాలుగులైన్ల రహదారి నిర్మాణం, మురుగునీటి సమస్య పరిష్కారానికి సూయజ్ ట్రీట్‌మెంటు ప్లాంటు, తాగునీటి సమస్య పరిష్కారానికి రెండోవేసవి జలాశయం ఏర్పాటు, 5365 మందికి టిడ్కో ఇళ్లు, జగనన్న ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇళ్ల నిర్మాణం, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు, గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకెలు, డిజిటల్ లైబ్రరీలు, ఆరోగ్యకేంద్రాలు, పాలవెల్లువ కేంద్రాలు నిర్మాణం, నాలుగు లక్షల ఆరువేల 180 మందికి సంక్షేమ పథకాల వర్తింపు, 86357 మంది లబ్ధిదారులకు నాన్‌డీబీటి ద్వారా లబ్ధి, ఐదేళ్లలో 1070 కోట్ల రూపాయల వ్యయం. ముఖ్యంగా సంక్షేమ పథకాలకు సంబంధించి అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలతో విద్యావ్యవస్థకు అండగా నిలబడగా, కాపు నేస్తం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు లబ్ధిదారులకు ఆర్థికంగా అండగా నిలబడ్డాయి. రహదారుల నిర్మాణాలు, సచివాలయ భవనాలు, ఆర్బీకే సెంటర్లు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, జలజీవన్ మిషన్ తాగునీరు, నాడు నేడు పాఠశాల భవనాలు వంటి నిర్మాణాలు జరిగాయి. ఈ పరిస్థితులను బేరీజు వేసుకొని నియోజకవర్గం ప్రజలు గూడెంలో కొట్టు విజయం సాధించడం ఖాయమన్నారు.

త్రైత సిద్ధాంత యుగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

భీమవరం: శ్రీక్రోధి నామ సంవత్సర త్రైత సిద్ధాంత యుగాది తెలుగు క్యాలెండర్‌ను ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక భీమవరం సభ్యుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన జ్ఞాన తెలుగు క్యాలెండర్‌లో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికీ సరళమైన భాషలో అర్థం అయ్యే విధానంగా రూపొందించారన్నారు. ఇంకా అనేక విశేషాల్లో భాగంగా దేవాలయం సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం , తెలుగు పండుగులు, నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకాల సారంతో పాటు ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉన్న భగవద్గీత సారాంశం ఇందులో పొందుపర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.నాగేశ్వరరావు, లోకేష్, వాసుదేవ రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తణుకులో జోరుగా వీస్తున్న ఫ్యాన్ గాలి

- ఏనోట విన్నా ఫ్యాన్... ఫ్యాన్
- సంక్షేమానికి పట్టం కట్టనున్న వైనం
- చదువుల విప్లవం.. విద్య వైద్యానికి పెద్దపీట
- నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధికి రూ. 3,300 కోట్లు



తణుకులో ఏర్పాటుచేసిన ఐలవ్ తణుకు ముఖద్వారం



తణుకులో ఏర్పాటుచేసిన జవాన్‌ల విగ్రహాలు



తణుకు ఆర్టీవో కార్యాలయ ప్రాంతంలో జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లు



తణుకులో రూ. 50 లక్షలు నిధులతో వేసిన భారీ సీసీ రోడ్డు

తణుకు అర్బన్: తణుకులో ఫ్యాన్ జోరు హైస్పీడ్‌లో తిరుగుతుండడంతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల గెలుపు నల్లేరుపై నడకగానే కనిపిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా అందజేసిన సంక్షేమం అభివృద్ధి పాలనను ప్రజలు స్వాగతించడంతో పాటు మంత్రి కారుమూరి ఈ 59 నెలల కాలంలో అందరివాడిగా అందరికి అందుబాటులో ఉంటూ అందించిన సేవలను ప్రజానీకం పరిగణలోకి తీసుకుంటున్నారు. ముఖ్యంగా తణుకులో ఒక ఎమ్మెల్యేని కలవాలంటే ఎన్నో సిఫార్సులు గేట్ల వద్ద పడిగాపులు వంటి పరిస్థితులు టీడీపీ జమీందారీ వ్యవస్థలో ప్రజలకు ఎదురయ్యే పరిస్థితి గతంలో ఉండేది. కానీ 2009లో మహానేత వైఎస్సార్ కొలువులో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు అందుబాటులో ఉన్న తీరు, ఏదైనా సమస్యల పరిష్కారానికి వచ్చిన వారి సమస్యలు సత్వరమే పరిష్కరించడం వంటి చర్యలతో మంత్రి కారుమూరి ప్రజల మనస్సు గెలిచారు. 2019లో తిరిగి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఒక మంత్రిని ఇలా కూడా కలవవచ్చా అనే రీతిలో ప్రజల మధ్యన ఉన్న తీరు కూడా తణుకు నియోజకవర్గ ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో రూ. 3,300 కోట్లు సంక్షేమం, అభివృద్ధి

తణుకులో నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలల్లో 2019 జగన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ. 3,300 కోట్లు సంక్షేమం, అభివృద్ధికి కేటాయించారు. ఇందులో భాగంగా డీబీటీ, నాన్ డీబీటీల రూపంలో రూ. 2,298.10 కోట్లు, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి 2,820 పనులకు గాను రూ. 998.80 కోట్లు వెచ్చించారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలకు సంబంధించి అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలతో విద్యావ్యవస్థకు అండగా నిలబడగా, కాపు నేస్తం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు లబ్ధిదారులకు ఆర్థికంగా అండగా నిలబడ్డాయి. అభివృద్ధిలో భాగంగా రహదారుల నిర్మాణాలు, సచివాలయ భవనాలు, ఆర్బీకే సెంటర్లు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, జలజీవన్ మిషన్ తాగునీరు, నాడు నేడు కార్యక్రమంలో పాఠశాల భవనాలను నిర్మించారు. ముఖ్యంగా తణుకు పట్టణం, మూడు మండలాల్లో ఈ 59 నెలల కాలంలో నిర్మాణం చేసిన సీసీ రోడ్లు, తారు రోడ్లు ప్రజలకు అందుబాటులోకి రాగా, తణుకు పెరవలి రోడ్డులో నిర్మించిన ఐలవ్ తణుకు ముఖ ద్వారాలు తణుకు పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, సుగర్స్ ఫ్యాక్టరీ ప్రాంతంలో నిర్మించిన జవాన్‌ల విగ్రహాలు బాలల్లో స్ఫూర్తి నింపేలా, బ్యాంక్ కాలనీలోని స్వాతంత్ర్య సమరయోధులు, వైఎస్సార్ పార్కులోని దేశ నాయకుల విగ్రహాలు దేశ చరిత్రను గుర్తుచేసున్నాయి. అన్ని వర్గాలకు మాజీ ఎమ్మెల్యేల పేర్లమీద కమ్యూనిటీ హాల్స్(టీడీపీ నేతల పేర్ల మీద), ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ పేరు మీద పార్కు, తణుకు స్త్రీ సమాజం రోడ్డులో రూ. 50 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం వంటివి కారుమూరి సృష్టించిన అభివృద్ధికి చిహ్నాలు.

జగనన్న కాలనీలు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన సహకారంతో తణుకు నియోజకవర్గంలో మొత్తం 120 లేఅవుట్‌లలో జగనన్న కాలనీలు రూపుదిద్దుకున్నాయి. నియోజకవర్గంలో 350 ఎకరాలు భూమిని రూ. 162.07 కోట్లుతో కొనుగోలు చేయించి పట్టణ పరిధిలో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున అందజేయగా లబ్ధిదారులు తమకు అందిన భూమిలో ప్రభుత్వ పూర్తి సహకారంతో నిర్మాణాలు పూర్తిచేసి తమ కుటుంబంతో ప్రశాంతంగా జీవిస్తున్నారు. అంతేకాకుండా ఇంటి నిర్మాణం చేసే ముందే విద్యుత్ మీటర్లు, మీటర్లు బిగించే సామాగ్రి ఉచితంగా అందచేశారు. జగనన్న కాలనీలన్నిటిలోను రహదారులు నిర్మాణాలు చేసి రూ. 129 కోట్లు నిధులతో విద్యుత్ సబ్ స్టేషన్‌లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాల వెలుగుతో పూర్తిస్థాయిలో వెలుగులు నింపారు.

కారుమూరి సేవాసమితితో..

కారుమూరి సేవా సమితి ద్వారా మంత్రి కారుమూరి పేదలు, ఆపదలో ఉన్న వారికి అందించిన సేవలు అజరామజరంగా నిలుస్తున్నాయి. పేదలకు ఏ నష్టం జరిగినా ప్రభుత్వం నుంచి రావాల్సిన లబ్దిని సంపూర్ణంగా బాధిత కుటుంబాలకు అందజేయడమే కాకుండా ప్రతి వేసవిలోను తణుకు నియోజకవర్గమంతా మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నారు. ప్రమాదాల్లో గాయపడ్డ సందర్భాల్లో వలంటీర్లకు, చికిత్స నిమిత్తం అయిన ఖర్చును చెల్లించేవారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని అక్కున చేర్చుకుని వారికి ఆర్థిక సాయం అందజేసేవారు. తనను నమ్మిన వారికి ఏ కష్టం వచ్చినా అండగా నిలబడి సాయం అందించే గుణం కారుమూరి సొంతం. అందుకే ప్రజానీకమంతా ఈనెల 13న నిర్వహించే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఆయనను గెలిపించేందుకు ఉత్సాహంగా చూస్తున్నారు.

శాసించేది ఆమే..

- సార్వత్రిక ఎన్నికల్లో నిర్ణయాత్మక శక్తిగా అతివలు
- నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 1,10,104 మంది
- యువత కీలకమే

తాడేపల్లిగూడెం: సోమవారం నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకం కానున్నారు. నియోజకవర్గంలోని బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు నిర్ణయించనున్నారు. తాజాగా విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పురుషుల కన్నా మహిళల ఓటర్లలే అధికం కావడం విశేషం. ఎన్నికల్లో మహిళలు ఎటువైపు మొగ్గు చూపుతారో వారు గెలుపు ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మహిళల ఓట్లు కీలకం కానున్న నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి మహిళాభివృద్ధికి పెద్ద పీట వేశారు. ప్రతిపక్షాలు వారిని టార్గెట్ చేసి మేనిఫెస్టో విడుదల చేసినప్పటికీ కూటమి మేనిఫెస్టోను మహిళలు నమ్మడం లేదు. జగన్‌మోహన్‌రెడ్డి తన మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని నూరుశాతం అమలు చేస్తాడనే నమ్మకం ప్రగాఢంగా నిలిచింది. జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం అయితే మహిళలకు రెట్టింపు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ప్రతి మండలంలోను పురుషులు కన్నా మహిళలే ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేయడంలో ఆమె కీలకంగా ఉంది.1,10,104 మంది ఉన్న మహిళా ఓటర్లు క్రియాశీలకం కానున్నారు. పురుషులు 1,04,871 మంది ఉండగా, ఇతరులు 10 మంది ఉన్నారు. మహిళలతో యువత ఈ సారి ఎన్నికల్లో కీలకం కానున్నారు. 5654 మంది యువ ఓటర్లు కొత్త రక్తంతో తమ ఓటు హక్కును వినియోగించుకోడానికి ఉవ్విళ్లూరుతున్నారు. సీనియర్ సిటిజన్లుగా ఉన్న 1108 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోబుతున్నారు. నియోజకవర్గ మొత్తం జనాభా -262620, నియోజకవర్గ మొత్తం ఓటర్లు - 214 985, పురుషులు -104871, మహిళలు -110104, ఇతరులు -10 వీటిలో సీనియర్ సిటిజన్లు -1108, యువత - 5654, హోం ఓటర్లు -151, పోస్టల్ బ్యాలెట్లు -2078, మొత్తం పోలింగ్ స్టేషన్లు -209, గూడెం మండలంలో-75, గూడెం పట్టణం -74, పెంటపాడు మండలం -60.

భారీ బందోబస్తు

సోమవారం జరుగనున్న పోలింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 18 రూట్‌లకు 18 రూట్ మొబైల్ పోర్సు, పోలీస్‌స్టేషన్ స్థాయిలో క్యూఆర్‌టీ టీమ్, స్ట్రైకింగ్ ఫోర్సు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సు, లాజిస్టిక్ సపోర్టు ఫోర్సు, ఈవీఎం గార్డులుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, సీఏపీఎఫ్ ఒక సెక్షన్‌ను బందోబస్తు కోసం వినియోగించనున్నారు. నియోజకవర్గంలో బందోబస్తు నిమిత్తం 167 సిబ్బందిని వినియోగిస్తున్నారు. హోంగార్డులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లను బందోబస్తు కోసం నియమించారు. గూడెం డీఎస్పీ పర్యవేక్షణలో శాంతిభద్రతల విధులను నిర్వర్తిస్తారు.

17 నుంచి కాళ్ళకూరు వెంకన్న కల్యాణోత్సవాలు



కాళ్ళకూరు ఆలయంలో పోస్టర్ విడుదల చేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

కాళ్ల: కాళ్ళకూరు గ్రామంలో స్వయంభూ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 17వ తేదీ శుక్రవారం నుంచి 25వ తేదీ శనివారం వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎం అరుణ్‌కుమార్ ఆదివారం తెలిపారు.ఈ మేరకు ఆయన అధికారులు, అర్చకులు సిబ్బంది ఆలయ ప్రాంగణంలో కల్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

పోలింగ్ సందడి షురూ



పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం



వీవీప్యాట్లు, ఈవీఎంలు సిద్ధం

తాడేపల్లిగూడెం: నియోజకవర్గంలోని 209 పోలింగ్ స్టేషన్లకు ఆదివారం ఉదయం పంపిణీ కేంద్రం తేతలి సత్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సామగ్రిని పంపించారు. రూట్‌ల వారీగా ఆర్టీసీ బస్సులలో సిబ్బందితో సహా వెళ్లారు. దఫదఫాలుగా పడిన వాన చినుకులు కాస్త ఇబ్బంది పెట్టినా సామగ్రి పంపిణీ ప్రక్రియ సజావుగా సాగింది. సాయంత్రం ఐదు గంటల సమయానికే ఆయా పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. రిటర్నింగ్ అధికారి కె.చెన్నయ్య పర్యవేక్షణలో సహాయక రిటర్నింగ్ అధికారులు సిబ్బంది ఈ ప్రక్రియలో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా మండలంలోని 71 పోలింగ్ కేంద్రాలకు ఆదివారం ఎన్నికల సిబ్బంది ప్రత్యేక బస్సుల్లో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను బిగించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, మంచినీరు వంటి సౌకర్యాలను కల్పించారు. సోమవారం ఉదయం నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



పంపిణీలో సిబ్బంది



జగన్నాథపురం పోలింగ్ స్టేషన్ వద్దకు బస్సుల్లో చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది

నియోజకవర్గంలోని ఓటర్లు...

తణుకు: నియోజకవర్గంలోని 2,34,575 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,14,435 మంది కాగా మహిళలు 1,20,135, ఇతరులు 5 మంది ఉన్నారు. వీరిలో తణుకు అర్బన్ పరిధిలో 75,507, తణుకు మండలంలో 50,442, అత్తిలి మండలంలో 55,597, ఇరగవరం మండలంలో 53,029 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

బరిలో 13 మంది అభ్యర్థులు...

తణుకు నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీలైన వైఎస్సార్ సీపీ, ఉమ్మడి కూటమి అభ్యర్థి ప్రధాన పోటీ నెలకొంది. దీంతో వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణతో పాటు కాంగ్రెస్‌పార్టీ, బీఎస్పీ, జైభీంరావు భారత్ పార్టీ అభ్యర్థులు, స్వంతంత్ర్య అభ్యర్థులు బరిలో ఉన్నారు.

ఓట్ల పండుగకు మేము సైతం..

జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది.. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వగ్రామాలకు తరలివస్తుండడంతో రహదారులన్నీ రద్దీగా మారాయి. దూరాభారమైనా, ప్రయాణపు ఇబ్బందులున్నా లెక్కచేయకుండా మంచి చేసిన ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు మేము సైతం అంటూ కదిలివస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని.. అందరూ ఇందుకోసం సమయం కేటాయించాలని.. అశ్రద్ధ చేయవద్దని పిలుపునిస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

- ఇతర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు తరలివస్తున్న ప్రజలు
- జిల్లాలో కనిపిస్తున్న పండుగ వాతావరణం
- తొలి ఓటు కోసం కొత్త ఓటర్లలో నూతనోత్సాహం



హైదరాబాద్ నుంచి ఓటు వేయడానికి భీమవరం వచ్చిన యువత

ఓటు వేసేందుకు బాధ్యతగా వచ్చా



ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు. బుల్లెట్ కంటే బ్యాలెట్ గొప్పది అని నిరూపించిన దేశం మనది. ఓటు వేయడం నా బాధ్యతగా భావించి హైదరాబాద్ నుంచి ఓటు వేసేందుకు స్వగ్రామమైన జంగారెడ్డిగూడెం వచ్చాను. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి.

– ఎ.తేజస్విని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి (జంగారెడ్డిగూడెం రూరల్)

ప్రజాస్వామ్యానికి ఓటు పునాది



విద్యావంతులు పోలింగ్‌కి దూరంగా ఉండటం ప్రజాస్వామ్యానికే ప్రమాదం. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా మార్పు రావాలి. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న నేను ఓటు వేసేందుకు స్వగ్రామమైన వేగవరం వచ్చాను. ఓటు అనేది హక్కు మాత్రమే కాదు.. బాధ్యత కూడా. ప్రజాస్వామ్యానికి ఓటు అనేది పునాది లాంటింది.

– చిట్యాల రమేష్ (జంగారెడ్డిగూడెం రూరల్)

ఓటు విలువ తెలుసు



హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. టికెట్ రూ.2 వేలు అయినప్పటికీ ఓటు వేసేందుకు ఆదివారం సాయంత్రం మా ఊరు ఆగిరిపల్లి వచ్చాను. ఓటు విలువ తెలుసు కాబట్టే.. ఓటు హక్కును వినియోగించుకుంటా. – చిటికెల శోభన గిరి, ఆగిరిపల్లి (నూజివీడు)

ఓటు వేయడం బాధ్యత



ఎన్నికల్లో ఓటు వేయడం బాధ్యత. హైదరాబాద్‌లో ఉండే నేను ఓటు వేయడానికి నా సొంతగ్రామం కొండేపూడి వచ్చా. ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ప్రజలకు మేలు చేసే, అభివృద్ధి చేసే ప్రభుత్వాన్ని నిర్దేశించవచ్చు. గతంలో కంటే ప్రస్తుతం యువత కూడా ఓటు హక్కు ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు.

– బి.బాలదుర్గాప్రసాద్ (భీమవరం ప్రకాశం చౌక్)

ప్రయాణపు ఇబ్బందులు ఉన్నా..



నేను ఉపాధి రీత్యా కుటుంబంతో సహ హైదరాబాద్‌లో ఉంటున్నాము. నా సొంత ఊరు భీమవరం. ప్రతి సంక్రాంతి పండుగకు భీమవరం వస్తుంటాం. ఇప్పుడు ఓట్ల పండుగకు మళ్లీ కుటుంబ సమేతంగా వచ్చాం. ప్రయాణపు ఇబ్బందులు ఉన్నా.. లెక్క చేయకుండా ఓటు వేయడానికి రావడం జరిగింది. ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత.

– అమనాపు అప్పారావు (భీమవరం ప్రకాశం చౌక్)

సమయం కేటాయించుకోవాలి



నా భర్త రెడ్డి ల్యాబ్స్‌లో ఉద్యోగం చేస్తారు. మేం ఉద్యోగ రీత్యా హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఉంటున్నాము. ఓటు హక్కు వినియోగించుకునేందుకు నర్సాపురం వచ్చాం. విలువైన ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలి. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించకొవడం కోసం ప్రతి ఒక్కరూ సమయం కేటాయించాలి.

– తెలగంశెట్టి ఉమ, నర్సాపురం (భీమవరం ప్రకాశం చౌక్)



ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం



నేను నెల్లూరులో తనూజ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో సివిల్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్నాను. నాకు, నా భార్యకు ఇక్కడే ఓటు హక్కు ఉంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వగ్రామానికి కుటుంబంతో కలిసి వచ్చాము. గతంలో కూడా పంచాయతీ, అసెంబ్లీ ఎన్నికలకు కూడా వచ్చి ఓటు వేశాం. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకం.

– జక్కం శెట్టి రవి, జున్నూరు (భీమవరం ప్రకాశం చౌక్)

మొదటిసారి ఓటు హక్కు



నేను గణపవరంలో ఉంటూ భీమవరం బీవీరాజు కళాశాలలో చదువుతున్నాను. నాకు మొదటిసారి ఓటు హక్కు వచ్చింది. మా ఊరు తాడేపల్లిగూడెం వెళ్లి ఓటు వేస్తాను. ఓటు చాలా విలువైనది.. అలాంటి ఓటు నేను వేయబోతున్నాను అంటే చాలా సంతోషంగా ఉంది.

– కట్రెడ్డి ప్రసన్న రాజు తాడేపల్లిగూడెం (భీమవరం ప్రకాశం చౌక్)

ప్రజల తలరాతను మార్చే ఆయుధం



నేను వైజాగ్‌లో ఇంజనీరింగ్ చదువుతున్నాను. ఓటు వేసేందుకు మా సొంత గ్రామం వచ్చా. ప్రయాణ ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని రెండు రోజులు ముందే వచ్చా. ఓటు ప్రజల తలరాతను మార్చే అయుధం.

– గుడిమెట్ల వెంకట గౌతమ్‌రెడ్డి, మార్టేరు (భీమవరం ప్రకాశం చౌక్)

చాలా సంతోషంగా ఉంది



నేను దుబాయ్‌లో జాబ్ చేస్తున్నాను. మా సొంత ఊరు పాలకొల్లు. ప్రస్తుతం హైదరాబాద్ పనిమీద వచ్చా. ఇదే సమయంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకొవడానికి పాలకొల్లు వచ్చాను. చాలా సంతోషంగా ఉంది.

– మంతెన గోపాలం, పాలకొల్లు (భీమవరం ప్రకాశం చౌక్)

ప్రజాస్వామ్య ప్రక్రియలో నేను సైతం..



ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయమే ఆకివీడు వచ్చా. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో అధిక చార్జీలు చెల్లించి ప్రయాణం చేసి వచ్చాను. మంచి ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పడాలనే ఆశయంతో ఓటు హక్కు వినియోగించుకుంటా.

– దాసరి రమేష్, హైదరాబాద్ (ఆకివీడు)

సంక్షేమం, అభివృద్ధికే మా ఓటు



పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడే నాయకుడు కావాలి. రాజకీయాల్లో యువతకూ స్థానం కల్పించి కొత్తవారిని ప్రోత్సహించాలి. అలాగే పార్లమెంట్‌లో రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడగలిగే నాయకుడు ఉంటే జాతీయ స్థాయిలో నిధులు వచ్చి రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతమౌతుంది. అటువంటి వారికే ఓటు వేస్తాం.

– జీ సిద్ధుసాయి గణేష్ (ఏలూరు ఆర్‌ఆర్ పేట)

ప్రయాణంలో ఇబ్బంది పడ్డాం..



పెదపాడు నుంచి హైదరాబాద్‌కు జీవనోపాధి నిమిత్తం చాలా కాలం క్రితం వెళ్లాం. ఎన్నికల్లో ఓటు వేసేందుకు మా ఊరు వచ్చాం. ట్రైన్లు, బస్సులు కిక్కిరిసిపోవడంతో ప్రయాణంలో చాలా ఇబ్బంది పడ్డాం. అయినా ఓటు హక్కును వినియోగించుకోవాలనే బాధ్యతతో ఇక్కడకు వచ్చాం.

– కర్రి శ్రీనివాసరావు (పెదపాడు)

ఇది మంచి అవకాశం



నేను హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాను. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం మా ఊరు వచ్చా. ప్రజలకు మంచి చేసి నాయకుడుని, నచ్చిన నేతను ఎన్నుకునేందుకు ఇది మంచి సదావకాశంగా భావిస్తున్నా.

– గంట తేజ, సత్యవోలు (పెదపాడు)

ఓటు ఐదేళ్ల భవిష్యత్తు



హైదరాబాద్ చందానగర్ నుంచి ఓటే వేసేందుకు మా ఊరు వచ్చా. ఓటు హక్కును వినియోగించుకునేందుకు పుట్టినిల్లు మా గుండుగొలనుకు వ్యయప్రయాసాలతో వచ్చాను. ప్రజాస్వామ్యంలో ఓటు పవిత్రమైంది. ప్రజల తలరాతను మార్చే శక్తి ఓటు వల్లే సాధ్యం. ఐదేళ్ల ప్రజలు సుస్థిరాభివృద్ధి సాధించేందుకు, మంచి పాలకులను ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– దేగల ప్రియాంక, గుండుగొలను (భీమడోలు)

పోలింగ్‌కు సిద్ధం..



తాడేపల్లిగూడెం సుబ్బారావుపేట హైస్కూల్‌లో మోడల్ పోలింగ్ స్టేషన్

ప్రత్యేక పోలింగ్ స్టేషన్లు

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మూడు ప్రత్యేక పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని సుబ్బారావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాలలో పింక్ పోలింగ్ స్టేషన్‌ను మహిళలకు ప్రత్యేకంగా కేటాయించారు. ఇదే పాఠశాలలో, అలాగే పెంటపాడులోని పోస్టు బేసిక్ స్కూల్‌లో మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. వీటిని ఓటర్లను ఆకర్షించేలా ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. – తాడేపల్లిగూడెం



తాడేపల్లిగూడెం సుబ్బారావుపేట హైస్కూల్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పింక్ పోలింగ్ స్టేషన్

నేడు జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ సిబ్బందికి కేటాయించిన ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. ఎన్నికల సామగ్రితో సిబ్బంది ఆర్టీసీ బస్సుల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు.

- సాక్షి, నెట్‌వర్క్



తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురం పోలింగ్ బూత్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



పెనుగొండ: ఆచంటలో పోలింగ్ కేంద్రాలను కేటాయిస్తున్న అధికారులు



నరసాపురం: నరసాపురంలో పోలింగ్ సామగ్రి సర్దుకుంటున్న సిబ్బంది



తణుకు: తణుకులో పోలింగ్ కేంద్రాలకు బయల్దేరిన ఎన్నికల సిబ్బంది



నరసాపురం: పోలింగ్ కేంద్రాలకు బయలుదేరుతున్న సిబ్బంది



నరసాపురం: ఈవీఎం తనిఖీ చేసుకుంటున్న పోలింగ్ ఉద్యోగి